# అవసరం

రీకటిసుబ్రహ్మణ్యం



సీట్లో కూర్చున్నాడుగాని– పనిమీద కాన్సన్ట్రేడ్ కాలేకపోతూంది విశ్వేశ్వరయ్యమైండు.

ఆ రోజు ఉదయం పది గంటలకు– తన తోడల్లుడి నుండి ఉత్తరం వచ్చింది. 'తన దగ్గర అప్పుగా తీసుకున్న ఐదువేల రూపాయల్ని అర్జంటుగా పంపవలసిందని– తన కూతురిపెళ్ళి అనుకోకుండా నిశ్చయం కావడంవల్ల డిమాండ్ చేస్తున్నానని– 'ఏమనుకోవద్దని' వుత్తరంలో వుంది –

తల తాకట్టయినా పెట్టి తప్పక తెచ్చివ్వమని మొత్తం వుత్తరానికి 'సెంట్రల్ ఐడియా'– ఉన్నపాట్న అయిదువేలు తక్కువ వ్యవధిలో ఎక్కడ తీసుకురావడం ? తోడల్లుడి దృష్టిలో ఐదు రూపాయల్లా వున్నట్టుంది– అనే సందిగ్ధంలో వుండగా మరో టెలిగ్రామ్ వచ్చింది. టెలిగ్రాఫ్‌వారి నిర్లక్ష్యానికి గుర్తుగా– వుత్తరం కంటే ముందుగా టెలిగ్రామ్ యిచ్చినప్పటికీ ఆలస్యంగా అందడం విడ్డూరమనిపించలేదు విశ్వేశ్వరయ్యకు.

ఆ రోజంతా ఐదువేలు ఎలా సంపాదించాలి? అనే ప్రశ్నకు అతని బుర్ర లెక్కలు వేస్తూంది. చివరికి ఆన్సర్ లంచ్ అవర్‌కు జీరో వచ్చింది–

ఓ ఇంజనీరింగ్ ఆఫీస్‌లో హెడ్‌క్లర్క్ విశ్వేశ్వరయ్య. కంట్రాక్టర్ల దగ్గర సాధ్యమైనంత మేరకు గుంజాడు. సాయంకాలానికి ఐదు వందలు జమగూడాయి. అందులో సగభాగం విధిగా అసిస్టెంట్ యింజనీర్‌కు చెల్లించాలి. మిగిలేది బోడి రెండు వందల యాభై రూపాయలు. అయిదువేల అవసరానికి ఈ మొత్తం ఏ మూలకు ? రేపే డబ్బును పంపాలి–తోడల్లుడు రాసిన వుత్తరం + టెలిగ్రామ్ ప్రకారం—

ఏ ఇ గారు మొహమాటం మనిషి. డైరెక్టుగా బిజినెస్‌లోకి దిగేరకం కాదు. తనకు కావల్సిందేమిటో ఆఫీసులో కంట్రాక్టర్ల దగ్గర అడిగిపుచ్చుకోడు. బల్లక్రింద చెయ్యి పెట్టడు గాని– హెడ్‌క్లర్క్ జేబులు నిండాయా, లేదా అని గమనిస్తూ వుంటాడు దినమంతా.

కాని– క్యాంపులకెళ్ళినప్పుడు కంట్రాక్టర్లు కవర్లు అందిస్తుంటారని జీప్ డ్రైవర్ నరసయ్య ద్వారా విన్నాడు. ఈ సమయంలో తనను ఆదుకునే వ్యక్తి అసిస్టెంట్ ఇంజనీర్ అని చివరికి తీర్మానించుకున్నాడు.

ఇలా తనలో తను తన్నుకుంటుండగా డ్రాఫ్ట్స్‌మన్ జోగారావు కుర్చీ దగ్గరికివచ్చి కూలబడ్డాడు మరో కుర్చీలో –

''ఏమిటిసార్ ! పొద్దున్నుంచి మిమ్మల్ని గమనిస్తూనే వున్నాను. పరధ్యానంలో వున్నారు. ఏదో... గడ్డు సమస్యల్లో వున్నట్లుందే ?'' అన్నాడు నెమ్మది నెమ్మదిగా అతను.

''అబ్బే ! ఆలోచనాలేదు. పాడులేదు. నెలాఖరుకావొచ్చిందిగా. మన జీతాల బిల్లులు రాస్తున్నాను. ఎల్డీసీ లీవులో వున్నాడుగా. నేనివి రాయకపోతే – మీకూ–మన సిబ్బందికీ యిబ్బంది. కాస్త సాయంచేయండి. ఇదిగో... ఈ పేర్ల కెదురుగా వాళ్ల పేమెంట్ వేయండి. క్రింద సంతకంపెట్టి, ఏ ఇ గారి దగ్గరికి పంపించేస్తాను. చెక్కు వచ్చేస్తుంది. రేపు మార్నింగ్ కల్లా డ్రా చేసుకోవచ్చు. రేపు సాటర్‌డేకదా !''

''నిజమే అనుకోండి ! కాని మిమ్మల్ని చూస్తూంటే ఈ బిల్లులకోసం తన్నుకుంటున్నట్లులేదు. క్రితం నెలలోకూడ మన ఎల్డీసీ లేడు. అప్పుడుకూడా మీరే బిల్లులు రాశారు. ఆయన మరో నెలవరకూ రాడుగా ? సిక్‌లీవ్‌లో వున్నాడు !''

విశ్వేశ్వరయ్య తడబడ్డాడు. ఆ తడబాటు కప్పిపుచ్చుకునే సామర్థ్యం లేకపోడంతో పట్టుబడిపోయాడు.

''ఏమీలేదు. ఒకమాట. నాకు అర్జంటుగా అయిదువేల డబ్బు కావాలి. మా తోడల్లుడికి అర్జంటుగా టి. ఎమ్. ఓలో పంపాలి !''

''అదన్నమాట కథ. మనల్ని యిలాంటి సమస్యల్లో ఆదుకునేందుకు ఇప్పుడున్న శాల్తీ ఒక్కడే ఒకడు. వాడే మన ప్యూన్ పుల్లారావ్!''

మీ తలనొప్పికి సత్వర నివారణకు అత్యవసరమైనది – ఆస్ప్రో అనే అడ్వర్టయిజుమెంటులా వుంది అతని ధోరణి.

ఆ మాటతో ఉలిక్కిపడ్డాడు విశ్వేశ్వరయ్య.

''ఏమిటి ? ప్యూన్ దగ్గర అయిదువేల రూపాయలు అప్పు అడగడమా ? అసలు వాడి దగ్గర అంత డబ్బు ఎక్కడినుంచి వస్తూంది?''

చిన్నగా నవ్వాడు డ్రాఫ్ట్స్‌మన్.

''ప్యూన్ దగ్గర డబ్బులుండకూడదనే రూలు ఎక్కడ వుంది సార్ ! క్రితం నెల్లో వెయ్యి రూపాయలు నేను అప్పు తీసుకున్నాను. అడిగిచూడండి. వడ్డీకూడా ఎక్కువగా తీసుకోడు. మనం ఎంతయిస్తే అంత !''

''సరే!'' అందామనుకున్నాడు విశ్వేశ్వరయ్య. ఆ మాట అనేందుకు సుపీరియారిటీ కాంప్లెక్స్ అడ్డొచ్చిపడి, మౌనరూపం దాల్చుకుంది. డ్రాఫ్ట్స్‌మాన్ కాస్సేపుండి తన వర్క్‌మీదకి వెళ్లిపోయాడు.

పుల్లారావ్ ఎవరినీ యాచించడు. నిజంగా చెప్పాలంటే–ఆ ఆఫీస్‌లో పన్జేసే తన కంటే, ఏ ఈగారి కంటే ఉన్నతుడు. అలాంటి మనిషి యింత డబ్బును ఎలా సంపాదించాడు ? స్టాఫ్‌కు


సంతానము, గర్భాశయ వ్యాధులు, మొలలు, చర్మ వ్యాధులకు అనుభవచికిత్స. పోస్టు ద్వారా చికిత్స కలదు.

సరోజ నర్సింగ్ హోమ్,
డాక్టర్ యస్. సరోజిని,
H.O. కొత్తపేట చౌకు, విజయవాడ-1.
(బ్రాంచి : శీలంవారివీధి, జిన్నాటవర్, గుంటూరు.

సినీతారలు
మీకు నచ్చే నలుగురి తారల సెక్సు ఫొటోసెట్ 10 రూ.
మీరు మెచ్చే ఒక నటి,నటుడి ఫొటో సెట్ 5 రూ.
నటీనటుల అడ్రసులగల్గిన పేపర్ 2 రూ.
కావలసినవారు M.O. చేయండి.
వై.కె.మూర్తి,
బాసగిరివారివీధి విజయవాడ-2.

7 8 6
అల్లా పలు రోగాల్ని వాటికి నివారణలను కూడ సృష్టించాడు
(పి.ఎస్.)
ఉబ్బసము, ఇస్నోఫీలియా, రొమ్ము పడిశం (ఎన్నిరోజులమంచి వున్నను), మూర్ఛ—ఫిట్సు, మొలలు మొదలైనవానికి అద్భుత మైన గ్యారంటీ చికిత్స.
విస్సత్తున్నను మొదటి మోతాదు మందు సేవించినంతనే తొలగించును.
సంప్రదించండి :
ఆప్తమా క్యూర్ సెంటర్,
వార్డు నెం. 23 ఎదుట, మున్సిపల్ ఆఫీసు, షాలిబండ రోడ్, సయ్యద్ ఆలీ చబుత్ర,
హైదరాబాద్ - 500 265.
(ఆర్.టి.సి బస్సు రూటు నెం. 85)
సంప్రదించు వేళలు :
ఉ. 6-00 నుంచి మ. 12-00 గం.
సా. 4-00 నుంచి రా. 9-00 గం.


# అవసరం

తెలీకుండ మామూళ్ల వసూలు చేసుకుంటున్నాడేమోనన్న అనుమానం వచ్చిందతనికి.

ఆ రోజు సాయంత్రం అడ్రసు కనుక్కుని—ఎవరూ చూడని సమయంలో రాత్రి తొమ్మిది గంటలకు పుల్లారావ్ యింటిముందు స్కూటర్ ఆపాడు విశ్వేశ్వరయ్య. ఆ స్కూటర్‌ను ఆరు సంవత్సరముల క్రితం ఐదువేలుపెట్టి కొన్నాడు. ఇప్పుడు అమ్మదామన్నా కొన్నది మొదట సెకండ్ హ్యాండే కనుక దానికి రీసేల్ వ్యాల్యూలేదు. అందువల్ల తనే వాడక తప్పడంలేదు.

స్కూటర్ యింటి ముందాపిన విశ్వేశ్వరయ్యకు ఆశ్చర్యమేసింది. ఆ ఇల్లు నిజంగా పుల్లారావ్‌దేనా అని అనుమానమేస్తుందతనికి. అంత డబ్బున్న పుల్లారావ్ ఈ ఇంటిలోనేనా వున్నది అని అతని సందిగ్ధం. జేబులో నుండి స్లిప్ తీసి, ఎడ్రస్ చూసుకున్నాడు. అన్నీ సరిపోయాయి.

పూరిగుడిసె లాంటి యిల్లది. ఇంటిని చూస్తే లోపల పేకాట ఆడుతుంటారేమోనన్న సందేహం వస్తూంది. కాని బయట నీట్‌గా వున్నదాన్నిబట్టి — లోపల సంస్కారవంతులే సంసారం చేస్తున్నారని అనుకోక తప్పదు. డోర్‌నంబర్ తడిక తలుపుమీద మాసిపోయి, అరిగిపోయి వున్నాయి. పరిశీలనగా చూస్తే తప్ప అంకెలు సరిగ్గా కన్పించడంలేదు. ఈ పూరి గుడిసె లాంటి యింటిలో తనకు అయిదువేలు దొరుకుతాయని నమ్మకంలేదు విశ్వేశ్వరయ్యకు.

స్కూటర్‌కు స్టాండు వేసి, దాని ప్రక్కనే నిల్చున్నాడు. స్కూటర్ ఆగిన చప్పుడు విని కాబోలు బయట ఆడుకుంటున్న ఇద్దరి కుర్రాళ్లలో ఒకడు ఆయన వైపుకు చూసి యింట్లోకి పరుగెత్తాడు. మరో రెండు నిముషాల్లో పుల్లారావ్‌తో బయటికి వచ్చాడు.

"రండిసార్ ! ఇంతదూరం వచ్చారేమిటి?" సాదరంగా ఆహ్వానిస్తూ అన్నాడు పుల్లారావ్.

విశ్వేశ్వరయ్య ఆ పూరి గుడిసెలోకి అడుగు పెట్టాడు. ఆయన అనుకున్నట్లు లోపల పేకాట ఆడే వ్యక్తులు ఎవరూ లేరు.

పూరిగుడిసే అయినా — వంటగదిని వేరు చేస్తూ, వంటి బ్లాంకర్టన్ మధ్యలో వ్రేలాడుతూంది. ట్రాన్స్పరెంట్‌గానున్న ఆ గుడ్డ ఆవల పుల్లారావ్ భార్య పొయ్యి ముందుకూర్చుని ఏదో వండుతూండడం అస్పష్టంగా కన్పిస్తోంది.

విశ్వేశ్వరయ్య ఓ చెక్క కుర్చీమీద కూర్చున్నాడు. బిడియానికి అలవాటుపడ్డ ప్యూన్ పుల్లారావ్ చేతులు కట్టుకుని ఆఫీసులోలాగే వినయంగా నిలబడ్డాడు. అతనలా వుండడం వల్ల విశ్వేశ్వరయ్యకు డబ్బడగడం కాస్త యిబ్బందిని కల్గిస్తూంది. అయినా ఆత్మాభిమానాన్ని చంపుకుని అడుగక తప్పలేదు.

"పుల్లారావ్ ! నా కర్జంటుగా అయిదువేల రూపాయలు కావాలి. వడ్డీకూడ యిచ్చేస్తాను!"

ఎప్పుడూ 'ఓయ్ !' అని ఆఫీస్‌లో పిలిచే విశ్వేశ్వరయ్య అవసరంతోటి కాబోలు పేరుతో పిలవకతప్పలేదు. అవసరం అలాంటిది.

పుల్లారావ్ ఆశ్చర్యంతో విశ్వేశ్వరయ్య వైపుకు చూశాడు. అలా చూస్తాడని వూహించిన విశ్వేశ్వరయ్య — పాతచెక్క రాక్‌లోనున్న పుస్తకాలకేసి చూస్తూ కూర్చున్నాడు. విసుగనిపించాక చూపు మళ్ళించి—గోళ్ళవైపుకు చూసుకున్నాడు. చెప్పాలంటే ఎంతో యిన్‌కన్వీనియెంటుకు గురవ్తున్నాడన్నది నిజం.

పుల్లారావ్ కొడుకువచ్చి, విశ్వేశ్వరయ్య ప్రక్కనున్న జాజికాయ చెక్క పెట్టెమీద చాలీ చాలని చక్కెర, పాలకంటే నీళ్ళు ఎక్కువగా వున్న ఓ కషాయంలాంటి ద్రవాన్ని తెచ్చి అక్కడ పెట్టి వెళ్ళిపోయాడు. మొదట అదేదో వర్షాకాలంలో చూరునుండి కారే నీళ్ళేమో అనుకున్నాడు.

"సార్ ! కాఫీ తీసుకోండి !" అన్న పుల్లారావ్ మాటతో అది కాఫీయని సర్దిపెట్టి చేసుకున్నాడు. బలవంతంమీద అందులోని సగ భాగాన్ని లాగించి, సిగరెట్ వెలిగించాడు.

ప్యూన్ పుల్లారావ్ బ్లాంకర్టన్‌ను తొలగించుకుని లోపలికెళ్ళి ఓ చెక్కపెట్టెముందు ఓ అయిదు నిముషాలాగి, ఐదువేల రూపాయలతో తిరగివచ్చాడు. అవి దొంగనోట్లేమోనన్న అనుమానం లేదు. అసలు, సిసలైన కరెన్సీయే !

విశ్వేశ్వరయ్య లెక్కపెట్టుకున్నాడు. అయిదు వేలకు నోటురాసి యిచ్చాడు. అయితే యింత డబ్బు పుల్లారావ్‌కు ఎక్కడిదనే అనుమానం అతడ్ని పీక్కుతింటూనే వుంది.

* * *

విశ్వేశ్వరయ్య తోడల్లుడికి డబ్బును పంపించాడు. ఐదువేల రూపాయలు అడిగిన వెంటనే యిచ్చిన పుల్లారావ్‌కు మనసులోనే కృతజ్ఞతలు తెల్పుకున్నాడు.

మరుసటిరోజు ఆఫీసులో జోగారావ్ మళ్ళీ మాటలు కలిపాడు.

"డబ్బు అడ్జస్టు అయిందాసార్!" అంటూ.

తలాడించాడు విశ్వేశ్వరయ్య. ఆ తర్వాత అడిగాడు.

"ఇంతకీ... పుల్లారావ్‌కు ఆ డబ్బు...!"

"ఎక్కడిదనికదా మీ అనుమానం. మనం హైక్లాస్ పీపులం అయినా, లోక్లాస్ పీపులం అయినా ఈ డబ్బుతో అట్టే యిబ్బంది వుండదు సార్. హైక్లాస్ పీపులం అయితే ఫోన్లో మాట్లాడి మన స్టేటస్‌కి సంబంధించిన వారి నుండి డబ్బులు ఈజీగా గేదర్ చేసుకోవచ్చు. లోక్లాస్ పీపులం అయితే ముందు జాగ్రత్తతో డబ్బులు ఆదా చేసుకోవచ్చు. కాని మనం మిడిల్ క్లాస్ పీపులం. పైగా ఉద్యోగస్తులం. అందు

లోనూ యింజనీరింగ్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగస్తులం. కంట్రాక్టర్లనుండి డబ్బులు రాబట్టుకోవాలంటే డిగ్నిటీ మెయిన్‌టైన్ చెయ్యాలి. అందుకు తగ్గట్టు వేషధారణ అవసరం. అందుకోసం విధిగా మంచి ఖరీదైన బట్టలకోసం కొంత మొత్తాన్ని కేటాయించక తప్పదు. మిగిలేది సున్నా! మన హోదాకు యింట్లో ఫ్రిజ్ వుంటే బావుంటుందని భావించుకుంటాము. దాని ఖరీదు నేను చెప్పనక్కరలేదు. వేలల్లో వుంటుంది. ఇది అనవసరపు ఖర్చు. పైగా దానికి కరెంటు నిమిత్తం నెలకు నలభై రూపాయలదాకా బేర్ చేయాల్సి వుంటుంది. ఐదు వేలకు వడ్డీ వేసుకుంటే నెలకు దానిమీద ఎంత అనవసరంగా మనం ఖర్చుపెడుతున్నామో అర్థమవుతుంది. దాని వుపయోగం వుండొచ్చు. కాయగూరలు, పండ్లు నిలువ వుంచుకోవచ్చు. కాని మార్కెట్‌లో ఏరోజుకారోజు తాజాపండ్లు కాయగూరలు దొరుకుతాయి. అలాటపుడు ఈ ఫ్రిజ్ అవసరమేమిటి? ఇంట్లో ఫ్రిజ్ వుండడం కేవలం ప్రిస్టేజి కోసమే!

ప్రిస్టేజీలో యిరుక్కుని మనకుతెలీకుండనే డబ్బును వృధా చేస్తున్నాము. ఇంట్లో ప్రతి ఒక్కరికీ ఓ బ్రష్షు, టూత్‌పేస్ట్ అవసరం. నెలకు అందరిమీద వీటికోసం యాభై రూపాయలదాకా ఖర్చు. ప్రకృతి ప్రసాదించిన వేపచెట్లు మనకు వూరినిండా వున్నాయి. దంతధావనానికి వేపపుల్ల ఎంతోఆరోగ్యప్రదమైందని ఆయుర్వేద సిద్ధాంతము. దాన్ని పుల్లారావ్ నమ్ముతాడు. ఖర్చు లేకుండా దొరికే వేప్పుల్ల ఎంత ఆదా చేస్తుందో మనకు తెలిసి కూడ పట్టించుకోము.

ఈ టూత్‌పేస్టులూ, బ్రష్షులూ మన పరిసరాల్లో నివసించే వ్యక్తులు వాడుతూంటారు గనుక మనం వేపపుల్లను వాడడం యిన్ఫీరియారిటీగా ఫీలవుతాము. తద్వారా డబ్బు వేస్ట్. కాని మనిషికి కావాల్సింది ప్రిస్టేజ్!

మనిషి ఆరోగ్యానికి నడక ఎంతో అవసరం. కండరాల చలనం మనం వయస్సు మీరుతూన్నా వుత్సాహంగా వుండటానికి తోడ్పడుతుంది. పుల్లారావ్ ఆఫీసుకు నడిచే వస్తాడు. కాని మీకూ, నాకూ స్కూటరు ఎందుకు అవసరం? ప్రిస్టేజీకోసం. కాని దాని మెయిన్‌టెనెన్స్‌కు, పెట్రోలు ఖర్చులకు ఎంత ఖర్చవుతుంతో తెల్సి కూడ రేపటి అవసరాన్ని గూర్చి ఆలోచించడానికి ప్రయత్నించము.

సినిమాకెళితే బాల్కనీ కెళ్ళాల్సిందే! ఫామిలీతో వెళ్తే ఈ సిటీలో ముప్ఫయి రూపాయలకు ముప్ప. కాని మనకు ప్రిస్టేజి అవసరం గనుక మరో క్లాసుకు వెళ్ళము.

పుల్లారావ్ 'లోక్లాస్ పీపుల్' నుండి వచ్చాడు. ఒక వంద అటో, యిటో మనంత జీతమే ప్రతినెలా అందుకుంటున్నాడు. అతనికి ప్రిస్టేజి అవసరం లేదు.

వీటికి దూరంగా వుండడంవల్ల కొంతవరకు జీతంలో ఆదా చేసుకున్న డబ్బును మంచి మిత్రులకు, తక్కువ వడ్డీకి యిచ్చి సాయపడుతూ మిగులు డబ్బును యింప్రూవ్ చేసుకుంటున్నాడు. మనం ప్రెస్టేజిలో యిరుక్కుని, అవసరం వచ్చినపుడు అప్పుల పాలవుతున్నాము సార్! పుల్లారావ్‌కు, మనకూ అదే తేడా!"

విశ్వేశ్వరయ్యకు యింట్లో వున్న ఖరీదైన ప్రతివస్తువూ ఎందుకూ పనికిరానివిగా అన్పిస్తున్నాయి. ఎంత తక్కువ ధరకైనాసరే రేపటి కల్లా ఆ ఫ్రిజ్జూ, స్కూటర్ అమ్మేయాలనే నిర్ణయం మొదటిసారిగా అతని బుర్రలో జొరబడింది. ★

దాదాపు రెండు దశాబ్దాలపాటు
ఉత్కంఠ, వైవిధ్యం ఊపిరిగాగల
తమ రచనలతో పాఠకహృదయాలను
ఉర్రూతలూగించిన
ప్రఖ్యాత నవలా రచయిత్రి
స్వర్గీయ మాదిరెడ్డి సులోచన
చిట్టచివరి అద్భుత నవల
యక్షగానం
ఆంధ్రసచిత్రవారపత్రికలో
సీరియల్‌గా త్వరలో వెలువడబోతున్నది!